క్లుప్తంగా

రోటరీ బ్లడ్‌బ్యాంకుతో విశేష సేవలు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జుబ్లీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోటరీ బ్లడ్‌బ్యాంక్ విశేష సేవ లందిస్తోందని బ్లడ్‌బ్యాంక్ కమిటీ చైర్మన్ టీవీ బాలకృష్ణ అన్నారు. స్థానిక రోటరీ హాల్‌లో శుక్రవారం బ్లడ్‌బ్యాంక్ కమిటీ సమావేశం నిర్వహించారు. బ్లడ్‌బ్యాంక్ నూతన వాహనంతో పాటు కొత్తగా పరీక్షలు నిర్వహించే విభాగాన్ని సమకూర్చడంలో క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణ ప్రకాష్ సహకారం మరువలేనిదన్నారు. బ్లడ్ బ్యాంక్‌కు చెందిన పాత వాహనాన్ని రోటరీ బరియల్ గ్రౌండ్ సేవలకు వినియోగించుకునేలా ఎంపీ వంగా గీత రోటరీ లయస్థానం కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రారెడ్డికి అందించారన్నారు. కొత్త రక్త పరీక్షల యూనిట్‌ను త్వరలో వినియోగంలోకి తీసుకురావడానికి ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు వడ్డాది ఆదిత్య, సభ్యులు చార్మినార్ వర్మ, పాబోలు చిన్నపున్నయ్య పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి



జిల్లా క్రీడా మైదానం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాలు

నాగమల్లితోట జంక్షన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను తక్షణం అరెస్టు చేయాలని కోరుతూ జిల్లా క్రీడామైదానం వద్ద శుక్రవారం ప్రజా సంఘాలు ధర్నా నిర్వహించాయి. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ మహిళా రెజ్లర్లకు ప్రజాస్వామికవాదులు మద్దతు తెలపాలని కోరారు. ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, డీఎస్ఏ క్రీడాకారులు, వాకర్లు పాల్గొన్నారు.

పెంచిన రోడ్ ట్యాక్స్‌ను ఉపసంహరించాలి

బాలాజీచెరువు: రవాణా వాహనాలపై పెంచిన రోడ్ ట్యాక్స్ ఉపసంహరించుకోవాలని సీఐటీయూ సంఘాలు నిరసన చేపట్టాయి. స్థానిక రవాణాశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం టాటా మ్యాజిక్ ఓనర్స్, డ్రైవర్స్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి 25 శాతం నుంచి 30 శాతం ట్యాక్స్‌లు పెంచి తమను ఆర్థికంగా మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రభుత్వం తక్షణం స్పందించకపోతే ఆందోళన మరింత విస్తృతం చేస్తామన్నారు. అనంతరం ఆర్‌టీఓ సాయిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నగర జనసేన పార్టీ వీరికి మద్దతు తెలిపింది.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి



అరట్లకట్టలో నిల్వ ఉన్న నీటిని పారపోస్తున్న వైద్య సిబ్బంది

కరప: దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలో శుక్రవారం ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది రక్షిత నీటి ట్యాంకులు శుభ్రం చేయించి, ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు ఆయా గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులతో కలసి ప్రత్యేక పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

పుచ్చలపల్లికి ఘన నివాళులు

కాకినాడ సిటీ: సీపీఎం మొదటి అఖిల భారత ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్యభవన్‌లో నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జీ తదితరులు ఆయన పోరాటాలను వివరించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ అజయ్‌కుమార్, సీహెచ్ రమణి, పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్ వాకర్స్ ఆధ్వర్యంలో ...

కాకినాడ రూరల్: కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి వాకర్స్ జిల్లా కో ఆర్డినేటర్ అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, రెడ్నం రాజా తదితరులు నివాళులు అర్పించారు.



బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సుందరయ్య చిత్ర పటానికి నివాళులు

చల్లని దాతలు

- నగరంలో రోజురోజుకు పెరుగుతున్న చలివేంద్రాలు
- ప్రజల్లో పెరుగుతున్న సేవాభావం



పిండాల చెరువు సమీపంలో గురువిశ్వస్ఫూర్తి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం (ఫైల్)



కలెక్టరేట్‌లో జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా (ఫైల్)

నాగమల్లితోట జంక్షన్: మండు వేసవి.. నడినెత్తిన సూరీడు.. కాలికింద సెగలు కక్కుతున్న నేల ఒంట్లో సత్తువంతటినీ క్రషర్‌లో చెరకు రసం లాగేసేలా పీల్చేసే తాపం.. గొంతు ఎండిపోయి.. కళ్లు బయర్లు కమ్ముతున్న వేళ.. ఎదురుగా చలివేంద్రం. ఇది చాలదా మనిషిలా మళ్లీ నిలబడడానికి. దాతృత్వాన్ని చాటుకుంటూ సేవాభావంతో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ఊరుకోకుండా నిబద్ధతతో అంతరాయం లేకుండా వేసవికాలం అంతా నిర్వహిస్తున్న ఎందరో మహానుభావులు. వారంతా ప్రాతఃస్మరణీయులే కదా.

ఇలా నగరంలో ఎందరో సేవా తత్పరులు ఉన్నారు. కాకినాడ జర్నలిస్టు సంఘం, వైఎస్సార్ సీపీ దివంగత నేత రాగిరెడ్డి వెంకట జయరాం కుమార్ ట్రస్ట్ గత నెల 24న కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే ఆధ్యాత్మిక విశ్వగురువు సైంటిఫిక్ సెయింట్ శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి సేవా సంఘం, చందన బ్రదర్స్, హరీష్ స్పోర్ట్స్, సత్యసాయి సేవా సమితి, అడబాల ట్రస్ట్, ఎస్‌బీఐ, పోలీస్ శాఖ, బ్రాహ్మణ సేవా సంఘం, కొన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, యువజన సేవా సంఘాలు, వాకర్స్ అసోసియేషన్, రోటరీ, లయన్స్ క్లబ్, జీజీహెచ్‌లోని ఏఆర్‌పీ సెంటర్‌లో డాక్టర్ రాయవరపు సత్యభామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోను చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వీరిలో కొందరు ఏళ్ల తరబడి, మరికొందరు వారిని స్ఫూర్తిగా తీసుకుని, ఇంకొందరు వారు ఎదుర్కొన్న ఇబ్బంది మరొకరు ఎదుర్కొనకూడదని ఏర్పాటు చేస్తున్నారు.

జర్నలిస్ట్ సంఘం సేవలు అభినందనీయం



కలెక్టరేట్‌లో కాకినాడ జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్ర ఏర్పాటుచేయడం అభినందనీయం. కలెక్టరేట్‌కు రోజు వందలాది మంది వివిధ పనులపై వస్తుంటారు. వారంతరికీ ఈ వేసవిలో ఈ చలివేంద్రం ఎంతో ఉపశమనాన్నిస్తుంది.

– ఉద్దండ ఉమాగౌరి, బార్ అసోసియేషన్ కమిటీ సభ్యురాలు

రెండేళ్లుగా సేవ చేస్తున్నాం



తమ ట్రస్ట్ తరపున రెండేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది రాయుడు పాలెం జంక్షన్‌లో ఏర్పాటు చేశాం. జూన్ మొదటి వారం వరకు కొనసాగుతుంది. మండు వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం తృప్తినిస్తోంది.

– అడబాల రత్న ప్రసాద్, అడబాల ట్రస్ట్

ప్రజలకు సేవ చేయాలనే...



ప్రజలకు ఏదైనా సేవ చేయాలనే తపన ఉండేది. దీంతో బ్రాహ్మణ సేవా సంఘం కాకినాడ శాఖ కార్యదర్శిని కూడా కావడంతో సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో మజ్జిగ, నీళ్ల చలివేంద్రాలను రామారావు పేట మోర్ సూపర్‌మార్కెట్ ఎదురుగా ఏర్పాటు చేశాం.

– ఎం.విశ్వేశ్వరరావు, బ్రాహ్మణ సేవా సంఘం

గాయత్రి వాకర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ..



పాదచారులకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న గాయత్రి వాకర్స్ సంఘం సభ్యులు

కాకినాడ రూరల్: వేసవి ఎండలు తీవ్రంగా ఉండడంతో గాయత్రి వాకర్స్ అండ్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లోని బాటసారులకు శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. అంతర్జాతీయ వాకర్స్ సంఘం అధ్యక్షురాలు ప్రభావతి, కోమలి, నీలిమ, విజయ, రాజీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అలియన్స్ క్లబ్ కాకినాడ సేవాశక్తి ఆధ్వర్యంలో రోగులకు నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. అలయన్స్ అంతర్జాతీయ క్లబ్ నాయకుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అలియన్స్ క్లబ్ ద్వారా అభాగ్యులకు అండగా ఉంటున్నారమన్నారు. క్లబ్ మాజీ గవర్నర్ మునిరెడ్డి, అధ్యక్షులు లక్ష్మీ నాగేంద్ర, సుభద్ర, చంటి, శివ, రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భవనాలు సత్వరం పూర్తిచేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

- కలెక్టర్ కృతికా శుక్లా
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

కాకినాడ సిటీ: ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలను వేగవంతం చేసి గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులు పురోగతిపై జెడ్పీ, డ్వామా, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యం, మైన్స్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణ పనుల్లో పురోగతి కనబరచాలన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంజూరు చేసిన ప్రతి భవన నిర్మాణాన్ని వెంటనే మొదలు పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, డ్వామా పీడీ ఎం.వెంకటలక్ష్మి, డీపీవో ఆర్.విక్టర్, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఆర్.రమేష్, మైన్స్ డీడీ ఇ.నరసింహారెడ్డి, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.శ్రీనివాసు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలంటే బాబుకు చులకన

- అందుకే సొంతింటి కలపై వ్యంగ్యాస్త్రాలు
- గడప గడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి



లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పేదలంటే చులకన అని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. పేదలకు ఇచ్చిన సెంటు స్థలం శవాన్ని పూడ్చేందుకు సైతం చాలదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. స్థానిక జగన్నాథపురం 20వ డివిజన్‌లో శుక్రవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటికల నెరవేర్చాలనే లక్ష్యంతో సీఎం జగన్ రాష్ట్రవ్యాప్తంగా స్థలాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించి ఇళ్లు కట్టిస్తున్నారన్నారు. పేదలకు సొంతగూడు సమకూరుతుండడంతో ఓర్వలేక తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం జగన్ ఇచ్చిన స్థలంలో సుందరంగా ఇళ్లు కట్టి ఆయనకు కళ్లు తెరిపించేలా లబ్ధిదారులంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాకినాడ సిటీ పరిధిలో 650 ఎకరాలను సేకరించి 33 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించామని, తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రజల సంక్షేమాన్ని ఓర్వలేని చంద్రబాబుకు మరోసారి బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. డీఈ మాధవి, స్థానిక నాయకులు వెలమల మల్లేశ్వరరావు, కొపనాతి సత్యనారాయణ, చిక్కాల సుధాకర్, నరసింహమూర్తి, జగడం శ్రీనివాస్, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కౌలు గుర్తింపు కార్డులు

- తహసీల్దార్ మురార్జీ
- నేమాం, పండూరుల్లో గ్రామ సభలు



నేమాం గ్రామంలో సీసీఆర్‌సీ కార్డు పత్రాలు అందిస్తున్న తహసీల్దార్ మురార్జీ

కాకినాడ రూరల్: అర్హులైన ప్రతి కౌలు రైతుకూ ప్రభుత్వం సీసీఆర్సీ గుర్తింపు కార్డు మంజూరు చేస్తున్నట్టు తహసీల్దార్ మురార్జీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నేమాం గ్రామం నుంచి అవగాహన సదస్సులను ఆయన ప్రారంభించారు. ఉదయం నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరరావు, సాయంత్రం పండూరు గ్రామంలో ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు అధ్యక్షతన సభలు నిర్వహించి కౌలు రైతులను ఆదుకునేందుకు, వారికి రైతు భరోసా పెట్టుబడి సాయంతో పాటు ఎరువులు రాయితీ, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం పంట సాగు హక్కు చట్టం అమలులోకి తీసుకువచ్చిందన్నారు. కౌలు కార్డులు ద్వారా సాగుదారుడికి ప్రయోజనం కలుగుతుందని, దీనివల్ల భూ యజమానికి ఏ విధమైన ఇబ్బందీ ఉండదన్నారు. రైతులు తమ కౌలు రైతులకు కార్డులు ఇప్పించేందుకు సహకరించాలన్నారు. ఈనెల 26 వరకు షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వీఆర్వోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సెబ్ ఏఎస్పీగా ప్రేమ్ కాజల్



కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అదనపు ఎస్పీగా ప్రేమ్ కాజల్‌ను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ప్రేమ్ కాజల్ ఓ గ్రూప్ వన్ అధికారి, విశాఖ దిశ పీఎస్ ప్రత్యేక అధికారిగా పనిచేస్తున్న ఆమె పదోన్నతి పొంది కాకినాడ జిల్లాకు బదిలీపై వస్తున్నారు. కాకినాడ జిల్లా అడ్మిన్ ఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాస్ సెబ్ ఏఎస్పీగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఉచిత సంగీత శిక్షణ



సంగీత శిక్షణ ఇస్తున్న సూర్యావతి

సామర్లకోట: స్థానిక నూకాలమ్మ ఆలయంలో శ్రీ శారదా సంగీత నిలయం ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత సంగీత శిక్షణ ఇస్తున్నారు. చిన్నారులకు వేసవి సెలవులు కావడంతో శ్రీ శారదా సంగీత నిలయం సంగీత ఉపాధ్యాయిని లోకారెడ్డి సూర్యావతి ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకు సంగీత శిక్షణ ఇస్తున్నారు. ఈ నెలాఖరు వరకు నిర్వహించే శిక్షణలో 30 మంది సంగీతం నేర్చుకొంటున్నట్లు ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు.

రహదారి విస్తరణకు పరిశీలన



మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: జగన్నాథపురం పాత బ్రిడ్జి నుంచి మున్సిఫ్ జంక్షన్ వరకు (యానాం రోడ్డు) నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలసి తనిఖీ చేశారు. ఈ రోడ్డును మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల వెడల్పు చేసేందుకు పరిశీలించినట్లు తెలిపారు. రోడ్డు ఇరుకుగా ఉన్న దృష్ట్యా రోడ్డును ఇరువైపులా ఉన్న భవనాల యజమానులకు సమాచారం సేకరించేందుకు సంబంధిత ప్లాన్లను తయారు చేయడానికి తీసుకునే చర్యలపై సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ సర్వేయర్, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్, ప్లానింగ్ సెక్రటరీలు, ఇంజినీరింగ్ సిబ్బందితో ఆయన రోడ్డు విస్తరణపై పరిశీలించారు.

నేటి నుంచి మేరీ లైఫ్–మేరా స్వచ్ఛ షహర్

జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు మేరీ లైఫ్–మేరా స్వచ్ఛ షహర్ శనివారం నుంచి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్పొరేషన్ పరిధిలో 14 చోట్ల పాత వస్తువుల సేకరణ జరుగుతున్నట్టు కమిషనర్ మహేష్‌కుమార్ తెలిపారు. రెండు కేజీలకు మించి వస్తువులను అందజేసే వారికి కమిషనర్ పేరుతో ప్రశంసా పత్రం ఇస్తున్నారు. రెడ్యూస్, రీ సైకిల్, రీయూజ్ నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు వివేకానంద పార్కు ఆవరణలోని భరతమాత విగ్రహం వద్ద కమిషనర్ మహేష్‌కుమార్, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



ప్రదర్శనలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, పద్మావతి కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నగర మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలలు నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50 పైగా డిజనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కత్తా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాలు నుంచి ప్రముఖ డిజైనర్లు తీసుకు వచ్చి నగర ప్రజలకు లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలు పరిచయం చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 21వ తేదీ రాత్రి 9 గంటలు వరకూ ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చెత్తతో సంపద తయారు చేద్దాం

పిఠాపురం: చెత్తను సద్వినియోగం చేసుకుంటే సంపద తయారవుతుందని, ఈ విషయాన్ని అవగాహన చేసుకుని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో చెత్తను త్రిబుల్ ఆర్ కేంద్రానికి అందజేయాలని గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ కోరారు. స్థానిక నగర పంచాయతీ 1, 2 సచివాలయాల పరిధిలో శుక్రవారం మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ్ సెహర్ కార్యక్రమంలో భాగంగా వార్డు సచివాలయాల సిబ్బంది మెప్మా సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ మెటీరియల్స్ అయిన దుస్తులు, పుస్తకాలు, చెక్కలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు జాగ్రత్త చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. 20వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకూ నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పలువురు వార్డు సచివాలయాలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ ఆడేద్దామా..

- వేసవిలో చిన్నారులకు శిక్షణ
- 15 ఏళ్లుగా కొనసాగుతున్న శిబిరం
- మెరికల్లాంటి క్రీడాకారులను సిద్ధం చేస్తున్న 'గుడ్ ఫ్రెండ్స్'



బాస్కెట్ బాల్‌లో మెళకువలు నేర్చుకుంటున్న చిన్నారులు



గోల్ వేయకుండా డిఫెన్స్ చేయడంపై శిక్షణ

సామర్లకోట: క్రీడలపై చిన్నారులకు ఆసక్తి కలిగేలా గుడ్ ఫ్రెండ్స్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఎంతో కృషి చేస్తోంది. స్థానిక ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలల్లోని సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు సుమారు 15 ఏళ్లుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో చిన్నారులకు వేసవిలో చిన్నారుకు బాస్కెట్ బాల్‌లో శిక్షణ ఇస్తున్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గుర్తింపు ఉన్న ఈ సంఘం సామర్లకోట నుంచి ఉత్తమ క్రీడాకారులను తయారు చేస్తోంది. పగటి పూటే కాకుండా రాత్రి వేళ ఫ్లడ్ లైట్ల వెలుగులోనూ శిక్షణ ఇస్తున్నారు.

సంఘం ప్రతినిధులు ఎండీవీ ప్రసాద్, పి.గిరిధర గోపాల్, జి.సంజయ్, ఐ గోపాలకృష్ణ తదితరుల శిక్షణలో ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి టోర్నీల్లో పాల్గొన్నారు. ఇటువంటి టోర్నీలు నిర్వహించడానికి అనువైన ఆట స్థలంలో ప్రస్తుతం 80 మంది చిన్నారులు శిక్షణ పొందుతున్నారు.